ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 26 మే , 2026 | పేజీలు : 06


## రైతుల పక్షపాతి మన ప్రజా ప్రభుత్వం



**ప్రజాపక్షం/దేవరకొండ;** ప్రజాపాలనలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కొండభీమనపల్లి గ్రామంలో ఆహార ధాన్యాల నిల్వ గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, సర్పంచ్ శ్రీను, నర్సింహా, మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్య గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పేరుకే 'ప్రజావాణి'.. పరిష్కారమే కరువు!

### నెలలు గడుస్తున్నా అతీగతీ లేని దరఖాస్తులు, తాగునీటికీ కటకట

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం నీరుగారిపోతోంది. సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి బాధితులు పెద్దఎత్తున కలెక్టరేట్‌కు తరలివస్తున్నా, వారి దరఖాస్తులు బుట్టదాఖలవుతున్నాయని, నెలలు గడుస్తున్నా పరిష్కారం శూన్యమని బాధితులు వాపోతున్నారు.ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నా,కొన్ని మినహా మిగతా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపిస్తున్నారు. దరఖాస్తు ఇస్తే వచ్చే వారం రండి అంటారు.మళ్లీ వస్తే అదే మాట.ఇలా నాలుగైదు నెలలుగా చెప్పులరిగేలా తిరుగుతున్నా మా సమస్యలు పట్టించుకోవడం లేదు అని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.




**బ్యాటరీ వాహనం కోసం 4 నెలలుగా తిరుగుతున్న**



రెండు కాళ్లూ లేవు. నడవలేని స్థితిలో బ్యాటరీ వాహనం కోసం దరఖాస్తు చేసుకొని నాలుగు నెలలు దాటింది. ప్రతి సోమవారం వస్తున్నా తిప్పించుకుంటున్నారు తప్ప ఇచ్చింది లేదు. నాకు చావే శరణ్యం అని అనుము ల మండలం పగోవానికుంట తండాకు చెందిన వికలాంగుడు ఆడెపు శ్రీనివాస్ గౌడ్ కన్నీటి పర్యంతమయ్యాడు.

**ఆగిపోయిన పింఛన్ మంజూరు చేయరూ**



కళ్లు కనిపించవు.2017 వరకు వికలాంగ పింఛన్ ఇచ్చారు.ఆతర్వాత ఆపేశారు.మళ్లీ మంజూరు చేయాలని పలుమార్లు వేడుకున్నా పట్టించుకోవడం లేదు" అని దామరచర్ల మండలం గోనియా తండాకు చెందిన ధరావత్ సర్దార్ వాపోయాడు.

**రెండేళ్లుగా 200 దరఖాస్తులు**

భూమి రిజిస్ట్రేషన్ కోసం అన్ని ఆధారాలున్నా ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ కలెక్టర్‌కు ఇవ్వమంటాడు,చండూరు ఆర్‌డిఓ నుంచి రావాలంటాడు,గట్టుప్పల్ తహసిల్దార్ ఎన్‌ఓసి కావాలంటాడు. ఇలా ఒకరిపై ఒకరు నెపం వేస్తూ రెండేళ్లుగా తిప్పించుకుంటున్నారు అని గట్టుప్పల్ మండలం వెల్మకన్యకు చెందిన వృద్ధురాలు,కుటుంబ సభ్యులు కలెక్టరేట్ ఎదుట బ్యానర్‌తో నిరసన తెలిపారు. కలెక్టరేట్‌లో కనీస వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


## సిరిధాన్యాలు వినియోగించేలా అలవాటు పెంపొందించుకోవాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రతిరోజు ఆహారంలో సిరిధాన్యాలను వినియోగించేలా అలవాటు పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మహిళా వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శరీరానికి అవసరమైన అన్ని పోషకాలను సరైన మోతాదులో అందించే సంపూర్ణమైన, పోషక విలువలతో కూడిన ఆహారం, సమతుల ఆహారం, రోజువారి ఆహారంలో కనీసం 8 రకాల ఆహారాలు ఉండాలని అందులో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, గింజలు, పప్పులు, దుంపకూరలు ఉండే విధంగా రోజువారీ ఆహారాన్ని తయారు చేసుకోవాలన్నారు. ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, కొవ్వులు, చక్కెర, ఉప్పు, ఆహారాలను తినడం తగ్గించాలన్నారు. మన పరిసరాలలో దొరికేటువంటి కూరగాయలు, పండ్లు ఇతర ఆహార పదార్థాల ద్వారా సంపూర్ణమైన ఆహారాన్ని ఎలా సమకూర్చుకోవాలో అలాగే వాటిలో ఉండేటువంటి పోషక విలువల గురించి ప్రదర్శనలో వివరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ నర్సింహారావు, సిడిపిఓలు కిరణ్మయి, శ్రీవాణి, సాయిలత, శ్రీజ, పారిజాత పార్వతి, హబ్ కోఆర్డినేటర్ చైతన్య, పోషణ అభియాన్ డిస్టిక్ కో ఆర్డినేటర్ కృష్ణ, రమేష్, సఖి పిఏ హేమలత, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

## బాధితులకు చట్టపరంగా న్యాయం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : గ్రీవెన్స్ డేకు వచ్చిన బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పోలీస్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేలో ఎస్‌పి స్వయంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 30 మంది బాధితులు భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, సివిల్, క్రిమినల్ అంశాలపై ఫిర్యాదులు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు వేగంగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పారదర్శకంగా విచారణ జరపాలి.పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించి, సానుభూతితో వారి సమస్యలు వినాలి అని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రతి ఫిర్యాదును చట్ట పరిధిలో సమగ్రంగా విచారించి న్యాయం చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.



## సామాజిక వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండల కేంద్రంలో 13 లక్షల వ్యయంతో నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ భవనాన్ని, 17 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రజక కమ్యూనిటీ భవనాలను మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక వర్గాల సంక్షేమం అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు. ముదిరాజ్, రజక సంఘాల ప్రజలు సామాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. ముదిరాజ్, రజక సంఘాల నాయకులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేస్తూ కమ్యూనిటీ హాల నిర్మాణం తమ సంఘాల చిరకాల కోరిక నెరవేరినట్టేనని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, మాజీ, తాజా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## చెమట చుక్కకు... చెట్టు నీడ తోడై!

**ప్రజాపక్షం/నకిరేకల్:** మండుటెండలో ఉపాధి హామీ పనులు పూర్తి చేసిన కూలీలకు చెట్టు నీడ ఊరటనిచ్చినా..హాజరు నమోదు కోసం నిరీక్షణ తప్పలేదు. కట్టంగూరు మండలం చెర్వుఅన్నారం గ్రామంలో కూలీలు పని ముగించుకుని చెట్ల కింద సేదతీరుతూ హాజరు నమోదు కోసం వేచి చూశారు. నెట్‌వర్క్ సమస్యలతో హాజరు నమోదుకు ఒక్కొక్కరికి ఐదు నుంచి పది నిమిషాల సమయం పడుతోందని కూలీలు తెలిపారు.దీంతో ఎండలో శ్రమించిన వారికి అదనపు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడు వరమిచ్చినా..పూజారి కరుణించలేదన్న చందంగా.. చెట్టు కనికరించింది గానీ..నెట్‌వర్క్ మాత్రం కనికరించడం లేదు అంటూ వాపోయారు. నెట్‌వర్క్ సమస్య పరిష్కరించాలని లేదా పాత విధానాన్ని కొనసాగించాలని కోరుతున్నారు. పనులు జరిగే ప్రాంతాల్లో చలువ పందిర్లు, తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు.



## వడదెబ్బకు గురికావద్దు

**ప్రజాపక్షం/మోతె :** మండలంలో ప్రజలు ఎవరూ ఎండ సమయంలో బయటకు వెళ్ళవద్దని మండల వైద్యాధికారిని భవాని సూచించారు. ప్రస్తుతం తీవ్ర ఎండలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని చెప్పారు. తగినంత నీరు, ఓఆర్ఎస్, మజ్జిగ, కొబ్బరినీరు వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, పలుచని పత్తి దుస్తులు ఉపయోగించాలని పేర్కొన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక జ్వరం, తల తిరగడం, వాంతులు, నీరసం, స్పృహ తప్పడం వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని చెప్పారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

## అనారోగ్యంతో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని ఉండ్రుగొండ గ్రామంలో ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండ్రుగొండ గ్రామానికి చెందిన నరేంద్రుని శ్రీకాంత్ ఇంట్లో గత కొంతకాలంగా కిరణ్ అనే వ్యక్తి అద్దెకు నివాసం ఉంటున్నాడు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కిరణ్ ఆదివారం సాయంత్రం తన అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కిరణ్ పూర్తి వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు ఇప్పటి వరకు తెలియరాలేదు. కిరణ్ గురించి సమాచారం ఎవరికైనా తెలిసి ఉంటే వెంటనే చివ్వెంల పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ వి. మహేశ్వర్ కోరారు. 8712686031కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు.

## గంగదేవమ్మ కల్యాణ మహోత్సవంలో దైద

**ప్రజాపక్షం/నకిరేకల్:** నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ శ్రీ గంగదేవమ్మ అమ్మ వారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తాటికల్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వెంకటేష్, భీమనబోయిన పెద్ద లింగయ్య,చిన్న లింగయ్య యాదవ్, జానయ్య, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.



## ఉపాధి హామీపై కేంద్రం కుట్ర



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** జాతీయ ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తే బిజెపి ప్రభుత్వం కుట్ర చేసి కూలీలా కడుపు కొడుతోంది అని ఎమ్మెల్యే మందుల సామేలు ఆరోపించారు. సోమవారం మండలంలోని ధర్మారం గ్రామంలో ఉపాధి హామీ పథకం కిందా మట్టి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపథకం పేరు మార్చి బిజెపి ప్రభుత్వం కూలీలా పనిదినాలు తగ్గించింది కూలీలా పనిదినాలు పెంచాలని డిమాండ్ చేసారు. కూలీలా హాజరు పోటో విధానం పరిశీలించారు.వెనుక బడిన తుంగతూర్తి నియోజకవర్గంలో అబివృద్ధి జరుగుతుంది అని తెలిపారు అడ్డగూడూరు మండలకేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ప్రభుత్వ కార్యాలయాలు, ఎటిసి కళాశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్, యవతకు ఉపాధి కోసం పరిశ్రమ, తీసుకొచ్చాను అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల మేరీఆనంద్, ఉపసర్పంచ్ కత్తుల నరేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి గిరి బాబు, అధికారులు రవిందర్, నాగయ్య ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో తాగునీటి సౌకర్యం కల్పించాలి



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తాగునీటి అందుబాటులో లేక కార్యాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తహసిల్దార్ కార్యాలయానికి నిత్యం వివిధ సమస్యలపై ప్రతిరోజు వందలమంది వస్తుంటారని, అసలే వేసవికాలం మండుటెండలతో గంటల తరబడి వేచి ఉండే వారు. బుక్కెడు నీళ్ల లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. కనీసం వేసవిని దృష్టిలో పెట్టుకుని కూడా తాగునీటిని అందుబాటులో ఉంచాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది మంది ప్రజలతో కిటకిటలాడే ప్రభుత్వ కార్యాలయంలో కనీసం మౌళిక వసతులు లేకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**తాగునీటిని అందుబాటులో ఉంచాలి**

మండల ప్రజలు రిజిస్ట్రేషన్‌లతో పాటు నిత్యం భూసమస్యల మీద కార్యాలయానికి ప్రజలు వస్తుంటారు. మనిషికి అన్నం పెట్టే భూమికి సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరించే తహసిల్దార్ కార్యాలయంలో తాగునీరు లేకపోవడం విచారకరమని అన్నారు. వేసవికాలంలో మరింతగా మంచినీటి సమస్య వేధిస్తోందని అన్నారు. మరికొంత మంది దప్పికను తట్టుకోలేక కార్యాలయం ఎదుట కిరాణషాపుకు వెళ్లి బాటిల్ 25 రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని, ఇప్పటికైనా తహసిల్దార్ కార్యాలయం వారు మంచినీటిని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన ఆరోపించారు.

## గణేష్ కేసును నీరుగార్చే ప్రయత్నం



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** బల్గూరి గణేష్ హత్య కేసును పోలీసులు నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని గణేష్ తండ్రి బల్గూరి మైసయ్య ఆరోపించారు. సోమవారం గణపవరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్‌ను బట్టలు విప్పించి, తన బట్టలతోనే కాళ్ళు చేతులు కట్టేసి ఇష్టానుసారంగా కొట్టి చిత్రహింసలు చేసి గొంతుకోసి దారుణంగా తన కుమారుడిని హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఇప్పటి వరకు సేకరించిన వేలిముద్రలు, ఫోరెన్సిక్ ఆధారాలు ఏమయ్యాయి ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. దీంతో ఈ కేసులో నింధితులను పట్టుకోవాల్సిన పోలీసులు నిజాలను దాచిపెట్టి కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానం ప్రజల్లో బలంగా వ్యక్తమవుతుందన్నారు. డిఎస్పి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపిన వ్యాఖ్యలు నిజాలను మాయం చేసే ప్రయత్నంగా కనిపిస్తున్నాయన్నారు. గణేష్ వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా ప్రేమ వ్యవహారం కోణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం అనుమానాస్పదంగా ఉందన్నారు. మరణించిన వ్యక్తి గౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు దళిత యువకుడు అయినప్పటికి ఈ కేసులో ఎస్సి, ఎస్టి యాక్ట్ అమలు చేయకపోవడం దళితులపై జరుగుతున్న అన్యాయానికి ఉదాహరణగా అభివర్ణించారు. న్యాయం కోసం ప్రజాస్వామ్య పోరాటాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం



**ప్రజాపక్షం/మోటకొండూరు :** రైతు ఆరు గాలం రక్తాన్ని చెమటగా మార్చి ధాన్యాన్ని పండిస్తే పండించిన పంటను కొనుగోలు చేయడంలో తీవ్ర జాప్యం జరగడంతో రైతు కళ్ళల్లో కన్నీళ్లు వస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర సేన ఆలయ నియోజకవర్గ ఇన్చార్జి కందడి మణిపాల్ రెడ్డి అన్నారు. ఆయన సోమవారం మోటకొండూరు మండల కేంద్రంలో రైతులకు మద్దతుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు సక్రమంగా కొనసాగడం లేనందుకు నిరసనగా తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరంఆయన సమావేశంలో మాట్లాడుతూ ఇకనైనా ప్రభుత్వం తక్షణమే రైతు పండించిన ధాన్యాన్ని వారం 10 రోజులలో కల్లాలలో ఒక గింజ ఉండకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని లేని పక్షంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, మంత్రుల ఇల్లు ముట్టడి చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు ఎత్తరి గణేష్, కొడే ఉపేందర్, కానుగంటి శ్రీనివాస్, వడ్డబోయిన బిక్షపతి, యాదగిరి, చంద్రయ్య, మల్లేష్, శ్రీధర్, బాలమ్మ, నర్సమ్మ, లక్ష్మి, చంద్రమ్మ, తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలు రైతులు మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** అర్హులైన మహిళలందరికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి అన్నారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో బాగంగా సోమవారం నేరేడుచర్ల మున్సిపాలిటికి చెందిన స్లమ్ స్థాయి సమాఖ్యలు, పట్టణ సమాఖ్యలు సహాయ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ సాధికారత, ఆర్థిక భద్రత లక్ష్యంగా ఇందిర మహిళ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, రిసోర్స్‌పర్సన్ లు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నూతన భవనం నిర్మించాలి



**ప్రజాపక్షం/మునగాల:** పాత కమ్యూనిటి హాల్ స్థానంలో నూతన కమ్యూనిటి భవనంను వెంటనే నిర్మించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గుడిపాటి కనకయ్యమాదిగ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేలో డిపివోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలోని మాదిగ సామాజిక వర్గ ప్రజలకు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అనువైన కమ్యూనిటి హాల్ పూర్తిగా శిధిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదకరంగా ఉందని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పాత భవనాన్ని డిప్లొంటేషన్ చేసి ఆధునిక సదుపాయాలతో కొత్త భవనాన్ని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు నూకపంగు రాంబాబు ఉన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



**ప్రజాపక్షం/మునగాల:** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సర్పంచ్ వేమూరి సత్యనారాయణ అన్నారు. సోమ వా రం మండలంలోని నర్సింహాపురం గ్రామంలో తెలంగాణ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళల వారోత్సవాల సందర్భంగా మహిళల కోసం నిర్మిస్తున్న స్వయం శక్తి భవనం స్లాబ్ పూర్తయిన సందర్భంగా మామిడి, పూలు, కొబ్బరి మట్టలతో అలంకరించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, వార్డు సభ్యులు అజీజ్‌మియా, వీరబోయిన నరేష్, రేవూరి కళ్యాణి, మీసాల బిక్షం, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వీవోఏ సమీనా పాల్గొన్నారు.

## ఎండ సహాయక చర్యలు చేపట్టాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రాష్ట్ర వ్యాప్తంగా 46 డిగ్రీల సిఎస్ ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కావున ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలు దృష్టిలో పెట్టుకుని మద్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను గ్రామాల్లోని గ్రామ పంచాయతీల దగ్గర ప్రజలకు పంచాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకుబ్ అన్నారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం ఆర్ఐ ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సైదులు, పాపయ్య, నాగరాజు, చిలకపత్రి జీలకర్ర, పెంటయ్య, వీరస్వామి, నంద్యాల పిచ్చిరెడ్డి, విజయ్, గోపి, రాములమ్మ పాల్గొన్నారు.



## గ్రామ మౌలిక వసతుల కల్పనే ముఖ్యం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** గ్రామ మౌలిక వసతుల కల్పనే ముఖ్యమని ఇంద్రియాల గ్రామ సర్పంచ్ దీరావత్ వెంకటేష్ అన్నారు. సోమవారం ఎస్సీ కాలనీలో గ్రామ పంచాయితీ 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆయన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమములో ఉప సర్పంచ్ రెవెల్లి అశోక్, మాజీ సర్పంచ్ బండి కృష్ణ గౌడ్, మాజీ ఎంపీటీసీలు ఎదునోజు రాజానారాయణ, మొగిలిపాక సంతోష్, యాదగిరి పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే ధ్యేయం



**ప్రజాపక్షం/రామన్నపేట :** మండలంలోని నీర్నంల గ్రామంలో సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గోగుపాపులు బావి వద్ద ఉన్న గ్రామపంచాయతీ బోరు బావికి విజయవంతంగా మరమ్మతులు(రిపేర్) చేయించారు.గత కొంతకాలంగా సమస్యగా మారిన ఈ బోరును సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకుని పునరుద్ధరించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.బోరుబావి మరమ్మతు పనులను పర్యవేక్షించిన అనంతరం సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మన గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి,మండలంలోనే ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు మరియు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలింతలకు న్యూట్రిషన్‌పై అవగాహన

**ప్రజాపక్షం/రామన్నపేట :** గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని రామన్నపేట ఎసీడీపీవో సమీరా అన్నారు.రామన్నపేట మండల కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిడిపిఓ సమీరా గర్భిణీలు, బాలింతలకు న్యూట్రిషన్ పై అవగాహన కల్పించారు. గర్భవతులు బాలింతలు ఆరోగ్య సూచనలు పాటించాలని సూచించారు.అనంతరం తల్లులకు ఫుడ్ పోటీలు నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ హేమలత, ఏఎన్ఎంలు సాదియా, మంజుల, అంగన్వాడి టీచర్లు, ఆశాలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతీ పేద ఆడబిడ్డ ముఖంలో చిరునవ్వే లక్ష్యం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ సమాజంలో మహిళా లోకానికి సముచిత స్థానం కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన సంకల్పమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని విభిన్న వార్డుల్లో ప్రభుత్వం పంపిణి చేసిన ఇందిరమ్మ చీరెలను ఆయన ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణతో కలిసి అందించి మాట్లాడారు. పేదల కుటుంబాలకు చెందిన మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, వారి ముఖాల్లో ఆనందాన్ని నింపేందుకు ప్రభుత్వం అద్భుతమైన పథకాలను రూపొందించిందన్నారు. పట్టణంలోని లబ్ధిదారులకు నాణ్యమైన చీరెలను అందించడం ఎంతో సంతోషాన్ని అందించిందన్నారు. ప్రభుత్వం పేదలు, మహిళల



సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగానే పేదలకు సన్నబియ్యం పంపిణి, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, అర్హులకు రేషన్‌కార్డుల పంపిణి, మహిళలకు వడ్డీ లేని రుణాలు అందచేత వంటి వాటిని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గో టూ విలేజ్

**ప్రజాపక్షం/రామన్నపేట :** తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు విద్య, ఉద్యోగ రంగాలలో 9 శాతం రిజర్వేషన్లు అమలవుతున్న విషయం విధితమే.ఈ రిజర్వేషన్లు అట్టడుగులో ఉన్న మన జాతి బిడ్డలకు సంపూర్ణంగా అందే దిశగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గో టు విలేజ్ అనే కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రామన్నపేట మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ హాజరై మాట్లాడుతూ గత 30 సంవత్సరాలు ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అనేక ఉద్యమాలు చేసి వర్గీకరణ సాధించామని, ఇప్పుడు ఆ వర్గీకరణ ఫలాలు మాదిగ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, అందుకోసం మాదిగ



విద్యార్థులను చైతన్య పరచడం కోసం మందకృష్ణ మాదిగ గో టూ విలేజ్ అనే కార్యక్రమాన్ని చేపట్టాడని అన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను నిర్మించే ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ దిమ్మెలు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లయ్య మాదిగ, కక్కిరేణి పాపయ్య మాదిగ, జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ, టౌన్ ప్రెసిడెంట్ బొడ్డు శంకర్ మాదిగ, మేడి శంకర్ మాదిగ, కక్కిరేణి శంకర్ మాదిగ, నల్ల సాయిలు, దేశపాక నరసింహులు పాల్గొన్నారు.

## గర్భవతులు పోషక ఆహారం తీసుకోవాలి



**ప్రజాపక్షం/చిట్యాలః** గర్భవతులు, కిశోర బాలికలు ఆరోగ్యానికి బలం చేకూర్చే పోషకాహారాలను తీసుకోవాలని నల్లగొండ జిల్లా చిట్యాల, వెలిమినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు వెంకటేశ్వర్లు, నర్సింహ్మలు అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయా ఆరోగ్య కేంద్రాలలో సోమవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో వారు పాల్గొని గర్భిణీ స్త్రీలు, కిశోర బాలికలు పలు సూచనలు చేశారు. రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, ధాన్యాలు, చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని అన్నారు. జంక్‌ఫుడ్, అధిక చక్కెర, ఉప్పు, నూనె, అధిక ప్రాసెస్ చేసిన ఆహారాల వినియోగాన్ని తగ్గించాలన్నారు. నీరు, మజ్జిక, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ఆరోగ్య పానీయాలు తీసుకోవాన్నారు. ముఖ్యంగా గర్భిణీలు రక్తహీనత రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారిణి ఓ వెంకటమ్మ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది టి నర్సింగరావు, జోషికుమార్, సుధాకర్, అంగన్‌వాడీ సిబ్బంది సునిత, దాడి అరుణ, ఎన్ అపర్ణ, శోభారాణి, బుజ్జమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి శివారులోని వెంకటాపురంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. రోడ్డుకు సమీపంలోని వేపచెట్టు క్రింద ఒక వ్యక్తి చనిపోయి ఉండటాన్ని చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ నాగారాజు, ఎస్ఐ రవికుమార్, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్ళారు. మృతుడు పింక్ కలర్ చొక్క, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, సు మారు 45 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు కలి గి ఉంటాడని ఎస్ఐ రవి కుమార్ తెలిపారు. మృతదేహం బాగా ఉబ్బి, కుళ్ళిపోయాన స్థితిలో ఉందన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 8712670187, 8712670148 నెంబర్లకు ఫోన్ చేయగలరని తెలిపారు.



## తోటపల్లి సత్తయ్య మృతి బాధాకరం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని బిసి కాలనీకి చెందిన జర్నలిస్టు తోటపల్లి శ్రీనివాస్ తండ్రి తోటపల్లి సత్తయ్య మృతి బాధాకరం అని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి అన్నారు. అనారోగ్య కారణంతో సోమవారం తోటపల్లి సత్తయ్య మృతి చెందారు. సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి సత్తయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి ఆయన కుమారులు తోటపల్లి శ్రీనివాస్, శంకర్‌లను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, వార్డు సభ్యులు వస్కుల స్వప్న శ్రీనివాస్, మాడ్గుల యాదగిరి, ఏరుకొండ రాము, సిలివేరు శ్రీధర్, కూన భానుచందర్, మురళి, శ్రీశైలం, వెంకటేష్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతిని కలిసిన మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలను అధికారిక నివాసంలో సోమవారం పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యల పట్ల చర్చించారు. పరిష్కారాలకు తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. పోచంపల్లి పర్యాటక కేంద్రం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేందుకు తమ వంతుగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రజిని శ్రీనివాస్ గౌడ్ కౌన్సిలర్లు రావుల జంగయ్య సూరేపల్లి రాధిక రమేష్ జింకల లావణ్య యాదగిరి దేవరాయ కుమార్ భువనగిరి టిపిసిసి మీడియా కోఆర్డినేటర్ గుత్తి బాల శంకర్ ఆయన వెంట ఉన్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న ఎస్ఐ



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం పర్వదినం సందర్భంగా స్థానిక ఎస్ఐ నవీన్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతకాల గణపతి పూజ, పుణ్యవహచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్రనామర్చన మహాలింగార్చన ఇష్టకామేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐని దేవాలయ కమిటి వారు ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి నాగెళ్ల శంభిరెడ్డి, ఉత్సవ కమిటి సభ్యులు పెండ్లి లచ్చయ్య, భార్గవరెడ్డి, వెంకటరెడ్డి, బుస్సా రామారావు, అంజిరెడ్డి, ఆలయ అర్చకులు కొంకపాక శివ విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో విఫలం



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకష్ణారెడ్డి విమర్శించారు. సోమవారం లక్ష్మీ దేవికాల్వ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోహిణి కార్తె వచ్చింది ధాన్యం రాసులు ఎక్కువగా ఉన్నాయి వర్షం వస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు మారోజు వెంకన్న, సర్పంచ్ కాంటేస్టు అభ్యర్థి నక్క అబ్బయ్య బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనంతరెడ్డికి సన్మానం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** కాంగ్రెస్ పార్టీ మండల నూతనగా ఎన్నికైన కందడి అనంతరెడ్డిని సోమవారం క్లాస్ మెంట్ మిత్రులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైల్ల గోపాల్ రెడ్డి, ఎలిమినేటి జహంగీర్, రంగ చంద్రశేఖర్ గౌడ్, ఎలిమినేటి నగేష్, లోడి భాస్కర్ గౌడ్, కారుపాటి యాదగిరి పాల్గొన్నారు.



## పుర సంఘానికి కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటికి కోఆప్షన్ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కౌన్సిలర్లు పాటి అరుణా దేవి, బెల్లి సత్తయ్య, షేక్ షహజాది, సయ్యద్ ఇమ్రాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీతారమేష్ ప్రతిపాదించగా, 6వ, 9వ వార్డు కౌన్సిలర్లు జెరిపోతుల సత్యనారాయణ, ఏర్పుల పరమేష్‌లు బలపర్చారు. గత నెలలో జరిగిన కో ఆప్షన్ నామినేషన్ ప్రక్రియలో మొత్తం 4 స్థానాలకు గాను 23 మంది నామినేషన్లను దాఖలు చేయగా అందులోంచి కాంగ్రెస్ చెందిన 4గురు అభ్యర్థులను ఈ రోజు ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికైన సభ్యులకు మున్సిపల్ చైర్మన్ పందిరి గీతారమేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలియజేశారు.

## ఎబివిపి జిల్లా కన్వీనర్‌గా సూర్య

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి) కన్వీనర్‌గా చిట్యాల మున్సిపాలిటి కేంద్రానికి చెందిన కొంపెల్లి సూర్యను నియమించారు. ఈ నెల 22 నుండి 25 వరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఎబివిపి రాష్ట్ర సమావేశాలలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రావుల కృష్ణ నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. సూర్య ప్రస్తుతం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నారు. తనను కన్వీనర్ పదవిని అప్పగించిన నాయకులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పరిషత్ విధివిధానాలకు లోబడి నడుచుకుంటానని, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, జాతీయ వాదాన్ని పెంచడానికి ప్రయత్నిస్తానని అన్నారు.

## క్రీడల వల్ల కీర్తి ప్రతిష్టలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** క్రీడల వల్ల కీర్తి ప్రతిష్టలు వస్తాయని విశ్వాస పరిచర్య ప్రార్థనమందిరం వ్యవస్థాపకులు, సామాజికవేత్త, పాస్టర్ ధీరావత్ హన్మానాయక్ అన్నారు. ఫెయిత్ బంజారా ఆశ్రమ చిన్నారుల ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన చిన్నారులు, యువకులకు ఆటపాటల సమ్మర్ క్యాంప్ను సోమవారం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన 150మందికి నోట్ బుక్స్, ప్లేట్లు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు, బ్యాగులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి గెలుపుకు నాంది అన్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. అనంతరం మిఠాయిలు, పండ్లు, మజ్జిగ పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రమాబాయి, సుధారాణి, జనార్దన్, సుధాకర్, అనిత, కోటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ వైర్లు తెగి పడటంతో వరి చేను దగ్ధం

**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో విద్యుత్ వైర్ల రాపిడితో నిప్పు రవ్వలు పడి వరి చేను దగ్ధమైన సంఘటన కొల్లూర్ లో జరిగింది. గ్రామానికి చెందిన రైతు గంగరాజు రామకృష్ణకు చెందిన వరి పంట ఒక్కసారిగా మంటలకు ఆహుతై సుమారు 50 బస్తాల దిగుబడి నష్టం వాటిల్లింది. ఈ ఘటనలో రైతుకు దాదాపు రూ.50 వేల మేర ఆర్థిక నష్టం సంభవించినట్లు తెలిసింది. పంట నష్టం కారణంగా రైతు గంగరాజు రామకృష్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఈ ప్రమాదం మరింత కష్టాల్లోకి నెట్టిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.



స్థానిక రైతులు కూడా బాధిత రైతుకు ప్రభుత్వం అండగా నిలిచి నష్టపరిహారం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కరెంటు మెరుపుల వల్ల పంటలకు నష్టం జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## నక్సల్బరీ ఆవిర్భావం చరిత్రాత్మకం



**ప్రజాపక్షం/ఆలేరు** : దున్నే వారికే భూమి కావాలి అనే రణనినాదంతో 1967లో పశ్చిమ బెంగాల్లోని నక్సల్బరీ గ్రామంలో ప్రారంభమైన పోరాటం దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలకు దారితీసిందని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాచకొండ జనార్ధన్ అన్నారు. నక్సల్బరీ మార్గమే భారతదేశంలోని దళారీ, దోపిడీ వ్యవస్థలను అంతం చేసి నూతన ప్రజాస్వామిక విప్లవానికి బాటలు వేస్తుందని అన్నారు. నక్సల్బరీ ఆవిర్భావ 59వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలేరు పట్టణంలో సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి అప్పటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకత్వం ద్రోహం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కళ్లెపు అడివయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు చిరబోయిన రాజయ్య, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వంగాల మధుసూదన్ రెడ్డి, ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఊరడి రామచంద్రు, పీవైఎల్ జిల్లా నాయకులు కళ్లెపు నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన ఎంఆర్‌పిఎస్ జెండా ఎగరాలి

**ప్రజాపక్షం/ఆలేరు** : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలోని మాతమ్మ దేవాలయ ఆవరణలో సోమవారం ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల గ్రామ కార్యవర్గ సమావేశం ఉత్సాహంగా నిర్వహించారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశానికి సంఘము సీనియర్ నాయకుడు భైరపాక బెంజిమెన్ మాదిగ అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం ఎస్ పి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, ఆలేరు మండల ఇంచార్జి నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు, ఆలేరు మండల కో ఇంచార్జి కందుల నర్సింగ్ రావు మాదిగ హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం మూడు దశాబ్దాలుగా జరిగిన ఉద్యమ ఫలితాలను ప్రతి విద్యార్థి ఉపయోగించుకునేలా గ్రామ స్థాయిలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. జూలై 7న జరగనున్న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించి, మాదిగల ఆత్మగౌరవ ప్రతీక అయిన ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గొలనుకొండ గ్రామ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులుగా తాండ్ర సుధాకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా భైరపాక సందీప్ మాదిగ ఎన్నికయ్యారు. ఎం ఎస్ పి గ్రామ శాఖ అధ్యక్షులుగా బాకీ రాములు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా చందేపల్లి ఆనంద్ మాదిగ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భైరపాక బెంజిమెన్ మాదిగ, సుంచు అలెగ్జాండర్ మాదిగ, ముస్త్యాల మల్లయ్య మాదిగ, కాండ్రు ప్రభాకర్ మాదిగ, మారుపల్లి పాండు మాదిగ, మారుపల్లి ప్రవీన్ మాదిగ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా నవకలశ పంచామృత అభిషేకం

**ప్రజాపక్షం/భువనగిరి** : కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోవృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేద మంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయ మానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.





## న్యాయవాది హత్యకు నిరసనగా కోర్టు విధుల బహిష్కరణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** హైదరాబాద్‌లో వాహనంతో ఢీకొట్టి సీనియర్ న్యాయవాది ఖాజా మోయిజుద్దీన్‌ను దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ సోమవారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్యలు మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో న్యాయవాది మోయిజుద్దీన్‌ను హత్య చేశారని, ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను పోలీసులు వెంటనే పట్టుకోని శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మేక కుమార్‌రెడ్డి, రాయారపు భాస్కర్, రెడ్డిపల్లి సైదులు, భూక్యా రమేష్, పెండ్యాల నరసింహారావు, ఇబ్రహీం, ప్రభాకర్, శ్యామ్, శ్రీనివాస్, మోహన్, రాములు, వెంకటేశ్వర్లు, సతీష్, కార్తీక్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

**ప్రజాపక్షం/రామన్నపేట** : హైదరాబాదులో న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్ పై పథకం ప్రకారం కారుతో దాడి చేసి హత్య చేసిన దుండగులను వారి వెనుక ఉన్న రాజకీయ నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదులపై దాడి చేయాలని సంస్కృతికి ముగింపు పలకాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ యాదాసు యాదయ్య, ఐలు జిల్లా ఉపాధ్యక్షులు పాల్వంచ జగతయ్య, గడ్డం నర్సయ్య జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సమ్మర్‌క్యాంపు ముగింపు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని పీఎం శ్రీ జడ్పీ బాలికల హైస్కూల్‌లో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న విద్యార్థినిల సమ్మర్ క్యాంప్ సోమవారం ఉత్సాహంగా ముగిసింది. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, ఎంఈవో ధర్మానాయక్‌లు పాల్గొని మాట్లాడారు. విద్యార్థినిలు చదువుతోపాటు క్రాఫ్ట్, డ్రాయింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటిషియన్ కోర్సులు నేర్చుకోవడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, క్రీడల వల్ల శారీరక దారుఢ్యం లభిస్తుందన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న బాలికలకు వారు ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు కొర్ర కృష్ణకాంత్‌నాయక్, కిరణ్, సరిత, రేణుక, కృష్ణవేణి, తనుజ, అనిత, జ్యోతి, బేబిరాణి, పద్మజ, లక్ష్మి, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే మహిళలకు పెద్దపీట

**ప్రజాపక్షం/నడిగూడెం:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయంలోనే మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత నిస్తుందని సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు పది లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టే మహిళ సంఘ కార్యాలయం పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మహిళ సంఘాలకు బస్సులు కేటాయించడం, పెట్రోల్ బంకుల నిర్వహణ చేయిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో మల్సూర్‌నాయక్, పిఆర్ఎఈ లావణ్య, ఎపిఎం దుర్గప్రసాద్, కార్యదర్శి యలక ఉమారాణి, ఉప సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు దున్న మనీషా, ప్రదీప్, నాగారపు సరస్వతి, రాము, బాణల సతీష్, మహేందర్, గుండు శ్రీనివాస్ పాల్గొన్నారు.



## వరికొయ్యలను కాల్చవద్దు

**ప్రజాపక్షం/నడిగూడెం:** రైతులు వరి కొయ్యలను కాల్చ వద్దని గ్రామశాఖ బిఆర్ఎస్ అధ్యక్షులు బోనగిరి ఉపేం దర్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ రైతులు కొయ్యలను తగులబెట్టడం వల్ల రైతులకు ఎన్నోనష్టాలు భూసారం తగ్గుతుందని, నేలలోని పోష కాలు నశించి భూమి నిస్సారంగా మారుతుందని, మిత్ర పురుగులు చనిపోయి పంటకు తెగుళ్లు పెరుగుతా యని, కాలుష్యం వల్ల గాలి కలుషితమై పోతుందని, మంటలు అదుపుతప్పి పక్క ఉన్న పొలాలకు, ఇళ్లకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని అన్నారు. రైతులు రోటవేటర్‌తో భూమిని దున్నించి భూమిలోనే కుళ్లిపో యేలా చేయాలని, అప్పుడు పొలానికి మంచి సేంద్రియ ఎరువు లభిస్తుందని అన్నారు.

## చెక్కులు అందజేత



**ప్రజాపక్షం/చండూరు:** సీఎం సహాయ నిధి పథకాన్ని అర్హులై ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహ కారంతో మున్సిపాలిటీలోని 13మందికి మంజురైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం చండూరులో కౌన్సిల్ సభ్యులతో కలిసి ఆయన అబ్ధిదారులకు అందజే శారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం తోపాటు వారి ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి సుష్మావెంకన్న, బుషి పాక వాసు, కటకం రమేష్ , కో ఆప్షన్ సభ్యులు కలెట్ల చంద్రకళ మారయ్య , ఖలీల్ , మొగుదాల వెంకన్న, సలీమ షరీఫ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మోత్కుర్ మార్కెట్ కమిటి చైర్మన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రా లలో అధికారులు రైతులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రా లలో గన్ని బ్యాగుల కొరత, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వారం రోజుల్లో రైతులు తీసుకువ చ్చిన ప్రతి గింజను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయా లని ఆమె సూచించారు. ఇప్పటి వరకు ఎన్ని లారీల ధాన్యాన్ని మిల్లులకు పంపించారు. ఇంకా ఎన్ని లారీలు పంపాల్సి ఉందని అడిగి తెలుసుకున్నారు.

## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన మాన సిక వికలాంగుడు నిరుపేద అయిన వంచ రాజు అనారో గ్యంతో బాధపడుతూ ఆదివారం మరణించడంతో విషయం తెలుసుకున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో చైర్మన్ మబ్బు మహేష్ వంచ రాజు కుటుంబా నికి రూ. 5వేల ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఫౌండేషన్ ప్రతినిధులు, ఫ్రెండ్స్ యూత్ పాల్గొన్నారు.

# ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు



**ప్రజాపక్షం/దేవరకొండ;** ప్రజా పాలనలో అభివృద్ధి సంక్షేమం జోడేద్దుల పాలన సాగుతుందని దేవర కొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం మండలంలోని వైదోనివంపు గ్రామంలో నూతనంగా నిర్మిచనున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసంద ర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ ప్రజ లకు అవసరమైన సేవలను సులభంగా అందించేం దుకు ఆధునిక సౌకర్యాలతో ఈ భవన నిర్మాణం చేప డుతున్నట్లు సూచించారు. గ్రామ ప్రజలకు పరిపా లన సేవలు ఒకే చోట అందుబాటులోకి రావడం వల్ల పారదర్శకతతో పాటు పనుల్లో వేగం పెరుగుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు మెరు గుపరచడం పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. అనంతరం నల్లగాసు సరిత ఎల్లయ్య నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి ఇంటి యాజమానికి శుభాకాం క్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మాజీ జెడ్పిటిసి అరుణ సురేష్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రాంసింగ్, వేణుధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# నూనెగూడెం గ్రామంలో బడిబాట



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం నూనెగూడెం గ్రామంలో సోమ వారం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మద్దెపురం కొండమ్మ, జెడ్పిహెచ్ఎస్ హెడ్మా స్టర్ గంధం చంద్రకళ, ఉపాధ్యాయ బృందంతో కలిసి గ్రామంలోని ఉపాధి హామీ పనుల వద్ద పిల్లల తల్లిదం డ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను ప్రైవేట్ పాఠశా లలకు పంపవద్దని ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలకు మెరుగైన నాణ్యమైన విద్య ఉత్తమమైన ఉపాధ్యాయు లచే బోధించడం జరుగుతుందని తెలిపారు. పాఠశా లలో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, టైలు, బెల్ట్‌లు, షూలు, మధ్యాహ్న భోజనం తో పాటు అల్పాహారం కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చదు వుతో పాటు ఆటపాటలు, క్రీడలలో రాణించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలి పారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈకార్యక్ర మంలో ఉప సర్పంచ్ ప్రశాంత్, పంచాయతీ సెక్రటరీ ప్రియాంక, ఫీల్డ్ అసిస్టెంట్ దయాకర్, వివాకర్, ఉపా ధ్యాయులు బాలరాజు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహిళా వారోత్సవాలు

**ప్రజా పక్షం/వేములపల్లి** :99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా సోమవారం మండల కేంద్రం లోని ఆరోగ్య కేంద్రంలో మహిళా వారోత్సవాలను నిర్వహించారు.ఈకార్యక్రమంలో సిడిపిఓ చంద్రకళ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తల్లులు పోషకాహారం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు చిరుధాన్యాలు పప్పులు ఆకుకూరలు పండ్లు పాలు గుడ్ల తో పాటు నువ్వులు పల్లీలు తీసుకోవాలని సూచించారు,ఉప్పు చక్కెర నూనెలు అధికంగా వాడ కూడదని ఆమె అన్నారు.అనంతరం పోషకాహార స్టాల్ ఏర్పాటు చేసి తల్లులకు అవగాహన కల్పిం



చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుచరిత ఎంఈఓ లక్ష్మణ్ నాయక్,సిహెచ్ఓ ప్రవీణ్,సూపర్వైజర్ శాంత,అంగన్వాడి సూపర్వైజర్ పరిమి రజిని,ఏఎన్ఎంలు శైలజ కవిత అంగన్వాడీ టీచర్లు రోజా,జయమ్మ ఆశా వర్కర్లు, విగ్నే శ్వరి,రాధిక తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు తండాలు అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చీర సత్యనారాయణ అన్నారు. మండలంలోని గోవింద్ తండా రామస్వామి తండా పెద్ద పర్వతాపురం గ్రామాల్లో మహిళ భవనాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహిళలకు పెద్దపీఠ వేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు. మండలంలోని మహిళా భవనాలు మంజూరు చేయించిన ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, మహిళా అధ్యక్షురాలు యంజాల కళ, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నందరాజ్ గౌడ్, మాజీ జెడ్పిటిసి రాజేశ్వర్ యాదవ్, మాజీ ఎంపిటిసి శ్రీహరి నాయక్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/నూతనకల్ :** మండలంలోని ఎర్ర పహాడ్ గ్రామానికి చెందిన మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ తల్లి పసుల చంద్రకళకు ఇటీవల వెన్నెముక్కకు శస్త్ర చికిత్స జరిగి ఇంటి దగ్గర విశ్రాంతి తీసు కుంటున్న వారిని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ సోమవారం పరామర్శిం చారు. ఈ పరామర్శలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, పిఏసిఎస్ డైరెక్టర్ పసుల వెంకన్న యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు లింగాల రామచంద్రయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్యక ర్తలు, నాయకులు పాల్గొన్నారు.





## వినియోగదారుల మన్ననలు పొందాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వినియోగదారుల మన్ననలను పొందాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు రెబల్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పూల సెంటర్‌లో సొంత భవ నంలోకి మార్చిన సోలాపూర్ సింగ్ మిక్చర్ షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వశక్తితో వ్యాపార రంగంలో ముందుకు వచ్చి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం షాప్ నిర్వాహకులు ఉపేందర్ సింగ్ మాట్లాడుతూ సోలాపూర్ సింగ్ మిక్చర్ షాప్‌ను 1951లో ప్రారంభించామని, గత 75 సంవత్సరాలుగా ఆదరిస్తున్న వినియోగదారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇకపై ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్ పార్సెల్ ద్వారా సోలాపూర్ సింగ్ మిక్చర్‌ను పంపించే లక్ష్యంతో కొనసాగిస్తామన్నారు. లక్ష్మి బాయి, అర్చకులు శ్రీనివాస్, మొరిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ నూతన భవనం ప్రారంభం



**ప్రజాపక్షం/నూతనకల్ :** మండలంలోని పెదనెమిల గ్రామంలో నిర్మించిన అంగ న్‌వాడీ కేంద్రం నూతన భవ నాన్ని తుంగతుర్తి శాసనస భ్యులు మందుల సామేల్ సోమవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలోని చిన్నారులకు పోషకాహా రాన్ని అందించడంతోపాటు ఉత్తమమైన విద్యను నేర్పిం చాలని, గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారాన్ని అందించాలని అంగన్ వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ సంఘం సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జన్నారెడ్డి వివేక్ రెడ్డి, నాయకులు కాసోజు మదనాచారి, నాగం సుధాకర్ రెడ్డి, సర్పంచ్ సురకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పిఎం శ్రీ టీజీ ఎంఎస్ సమ్మర్ క్యాంప్ ముగింపు



**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలం లో మోడల్ స్కూల్ పెద్దాపురం సమ్మర్ క్యాంప్‌లో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలి చిన విద్యార్థులకు సోమవారం సర్పంచ్ పల్లే వెంకటేష్,ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి లు ప్రశంసాపత్రాలు అందజేసి బహుమతులు పంపిణీ చేశారు.విద్యార్థులను అభినందించారు అనంతరం వారు మాట్లా డుతూ ఈ సమ్మర్ క్యాంపుకు విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది.అదిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.సీఎం శ్రీ పథకం కింద మా పాఠశాలలో ఇలాంటి సమ్మర్ క్యాంపు నిర్వహిం చడం చాలా ఆనందంగా ఉందన్నారు.వేసవి సెలవుల్లో పిల్లల సమ యాన్ని ఇలాంటి వినూత్న కార్యక్రమంలో భాగస్వాములను చేసి నందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి పీఎం శ్రీ విభాగానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంపై అవగాహన

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు గర్భిణీలకు అనీమియా టెస్టులు చేశారు.ఈసందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ అస్రా అంజుమ్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వాతి ఐసిడిఎస్ సూపర్వైజర్స్ సునీత,భవాని,అంగన్వాడి టీచర్లు ధనమ్మ,లలిత రమణ,కవిత,గీత,నాగలక్ష్మి,అస్మత్ బేగం, గర్భిణీలు పాల్గొన్నారు.



## చెక్కు అందజేత

**ప్రజాపక్షం/చింతపల్లి :** అడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మీ పథకం అని ఘడియగౌరారం గ్రామ సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని ఘడియగౌరారం గ్రామానికి చెందిన చెట్టిమల్ల అపర్ణకు దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ చేతుల మీదుగా సోమవారం కల్యాణలక్ష్మీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం మాట్లాడుతూ నూతనంగా వివాహం అయిన ఆడబిడ్డలు కల్యాణ లక్ష్మీ పథకాన్ని సద్వినియోం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ ఉప సర్పంచ్ ఆదిరాల కృష్ణయ్య, కండాలపల్లి స్వాతి గిరి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నామిరెడ్డి వెంకటరామిరెడ్డి దశదినకర్మ




**ప్రజాపక్షం/తిప్పర్తి :** మండలంలోని జొన్నలగడ్డ గూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్,మాజీ ఎంపీటీసీ కీ.శే.నామిరెడ్డి వెంకట్‌రాం రెడ్డి దశదిన కర్మ సోమవారం గ్రామంలో నిర్వహించారు.నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## అక్రమ మట్టిలారీలను ధాన్యం కొనుగోలుకు ఉపయోగించాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని గోపాలపురం, నాగాయపల్లి గ్రామాల్లో పిఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గోపాల్పూర్ సర్పంచ్ పుట్ట సాయిలు ముదిరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో అధికారుల సమన్వయలోపంతో ఇబ్బంది పడుతున్న రైతులకు,కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలు రాక పడిగాపులు గాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.ఆలేరు నియోజకవర్గ స్థాయిలో నడుస్తున్న అక్రమ మట్టి లారీలను ఆపి, ధాన్యం లోడింగ్ కు ఒక్క రోజు కేటాయిస్తే,అన్ని సెంటర్లల్లో వడ్లు రవాణా చేయొచ్చని విమర్శించారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొండబోయిన శ్రీశైలం, దాసరి కొండల్, ఉడుత రాజు, చెనరాజు చింటూ, లకావతూ లక్ష్మణ్ పాల్గొన్నారు.



# శివన్నగూడలో గాలి దుమారానికి ఇల్లు నేలమట్టం

**ప్రాణాపాయం తప్పిన లక్ష్మణ్ కుటుంబం, సాయం కోసం అధికారులకు వినతి**



**ప్రజాపక్షం/మర్రిగూడ :** శివన్నగూడ గ్రామంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురు గాలులు,కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించాయి. గాలి దుమారం దాటికి గ్రామానికి చెందిన లక్ష్మణ్ కు చెందిన ఇల్లు పూర్తిగా కూలిపోయింది.ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇల్లు కూలుతున్న సమయంలో లక్ష్మణ్, ఆయన కుటుంబ సభ్యులు బయట పనులపై వెళ్లడంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారని స్థానికులు తెలిపారు. అయితే ఇంట్లో ఉన్న సామాన్లు, ధాన్యం, బట్టలు, గృహోపకరణాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.ఇల్లు పూర్తిగా దెబ్బతినడంతో లక్ష్మణ్ కుటుంబం ఒక్కసారిగా నిరాశ్రయులైంది. ప్రస్తుతం బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.సమాచారం తెలిసిన వెంటనే గ్రామ సర్పంచ్,వార్డు సభ్యులు, గ్రామస్థులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.లక్ష్మణ్ కుటుంబం రోజువారీ కూలీ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తోందని,ఉన్న ఒక్క గూడు కూడా కోల్పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని గ్రామ పెద్దలు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, ఇందిరమ్మ ఇంటి పథకం కింద కొత్త ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్థులు,స్థానికులు రెవెన్యూ, పంచాయతీ అధికారులను కోరుతున్నారు.ఈ ఘటనపై సమగ్ర నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపుతామని,నిబంధనల మేరకు బాధిత కుటుంబానికి తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని మండల రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు.

**వడ్ల కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి ముద్ద**

మండల కేంద్రంలోని వడ్ల కొనుగోలు కేందర్రంలో రైతుల ధాన్యం గాలి వాన బీభత్సానికి తడిసి ముద్దవుతోంది. కోతలు కోసి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు కాంటాలు చేయకపోవడంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే ధాన్యం ఎత్తివేతలు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని స్థానిక రైతు సంఘం నాయకులు కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# మాదిగల్లో అక్షరాస్యత పెంపుకు గో టు విలేజ్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**మాదిగ సామాజిక వర్గంలో డ్రాపౌట్లను తగ్గించి అక్షరాస్యతను పెంచేందుకు ఎంఆర్‌పిస్ ఆధ్వర్యంలో నేటి నుంచి జులై 5 వరకు 40 రోజుల పాటు గో టు విలేజ్ కార్యక్రమం చేపట్టినట్లు ఎంఆర్‌పిస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ తెలిపారు.టీఎన్‌జిఓఎస్ భవన్‌లో జిల్లా ఎంఆర్పీఎస్, అనుబంధ సంఘాల విస్మ్రాత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ సర్వే నివేదిక ప్రకారం అక్షరాస్యతలో మాదిగలు తీవంగ్రా వెనుకబడి ఉన్నారని, విద్య ప్రాముఖ్యతను వివరించేందుకు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ప్రతి గ్రామంలో చైతన్య సమావేశాలు నిర్వహిస్తామన్నారు.తెలంగాణలో ఎస్సి వర్గీకరణ అమలవుతున్నందున 9 రిజర్వేషన్ ఫలాలను మాదిగలు అందిపుచ్చుకోవాలి. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో చదువుకు దూరం కావద్దు. పేదరికం నుంచి బయటపడాలంటే చదువే ఏకైక మార్గం అని పిలుపునిచ్చారు. ఎంఆర్‌పిఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జులై 7న ప్రతి గ్రామంలో నూతన జెండా గద్దెలు నిర్మించి, మాదిగ జాతి పండుగగా జెండా పండుగ జరుపుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ,రాష్ట్ర సమన్వయకర్త జానకి రామయ్య చౌదరి,ఎంఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న మాదిగ,జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండల మాదిగ, ఎంఎంఎస్ మహిళా నాయకురాలు కురుపాటి కమలమ్మ మాదిగ, ఆడెపు నాగార్జున మాదిగ పాల్గొన్నారు.

# గ్రామాల్లో యువ ఆపద మిత్ర సేవలు అందించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో 31 టీ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 7 రోజుల పాటు నిర్వహించిన యువ ఆపద మిత్ర ప్రత్యేక శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. వివిధ కళాశాలలకు చెందిన 300 మంది ఎన్‌సీసీ కేడెట్లు విపత్తు నిర్వహణలో సైద్ధాంతిక, ప్రాక్టికల్ శిక్షణ పొందారు.ముగింపు కార్యక్రమంలో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ లక్ష్యారెడ్డి మాట్లాడుతూ వరదలు, తుఫాన్లు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, స్పందన, పునరావాసంపై సమగ్ర శిక్షణ ఇచ్చామని తెలిపారు.ప్రాథమిక చికిత్స, సీపీఆర్, క్షతగాత్రుల తరలింపు, తాత్కాలిక ఆశ్రయాల ఏర్పాటు, ఫైర్ సేఫ్టీ డ్రిల్స్‌పై మాక్ డ్రిల్స్ నిర్వహించి కేడెట్లకు ప్రాక్టికల్ నైపుణ్యాలు అందించామన్నారు.గ్రామస్థాయిలో రిస్క్ మ్యాపింగ్, స్థానిక వనరుల వినియోగం, స్వచ్ఛంద సేవాదళాల సమన్వయంపై కూడా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు.శిక్షణ పొందిన ఎన్‌సీసీ కేడెట్లు తమ గ్రామాలు, పట్టణాలు, కాలనీల్లో విపత్తు సమయంలో ముందుండి స్పందించాలని సూచించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రేఖ,లెఫ్టినెంట్ కల్నల్ శశిధర్ రావు, సుబేదార్ మేజర్ మాధవరావు,సుబేదార్ మల్లయ్య,ఆశిష్ కుమార్, యూసుఫుద్దీన్,డాక్టర్ జి.మచ్చేందర్,డాక్టర్ రాము, సీటీఓ నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## సబ్బండ వర్గాల కోసం మళ్లీ ఉద్యమం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**తెలంగాణ పునర్నిర్మాణం,సబ్బండ వర్గాల వికాసం కోసం మళ్లీ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇన్చార్జ్ పడిగపాటి విక్రాంత్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి వారు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన జెండాను ప్రతి వాడకు,పార్టీ సిద్ధాంతాలను గడపగడపకు తీసుకెళ్లాలని సూచించారు.పార్టీ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేసేందుకు పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి జూన్ 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రక్షణ సేన జెండా పండుగను చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు, జిల్లా పరిశీలకుడు కుందూరు దేవేందర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జీలు బొల్లంపల్లి సందీప్,ధీరావత్ సరిత,బాలు నాయక్,నేనావత్ శివ నాయక్,నరేష్,మాధవి,ఉమామహేశ్వరి పరిశీలకులు డాక్టర్ లింగం,పాలె నిష పాల్గొన్నారు.

## బడులకు భద్రత ఏది..?

**ప్రహరీ గోడ లేక పాఠశాల ఆవరణలో వాహనాలు**




**ప్రజాపక్షం/నకిరేకల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెబుతున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల పరిస్థితి మాత్రం ఆందోళన కలిగిస్తోంది. కట్టంగూరు మండలం చెర్వుఅనారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ పూర్తిగా ధ్వంసమై ఉండడంతో విద్యార్థుల భద్రతతో పాటు పాఠశాల నిర్వహణ కూడా ప్రశ్నార్థకంగా మారింది. ప్రహరీ గోడ లేకపోవడంతో పాఠశాల ఆవరణలో కొందరు వాహనాలు నిలుపుతున్నారని, కొంతమంది వ్యక్తులు మద్యం సేవిస్తున్నారని, జంతువులను కట్టిస్తున్నారని గ్రామ ప్రజలు, గ్రామ సర్పంచ్ చిలుమల సైదులు ఆరోపిస్తున్నారు. దీంతో పాఠశాల వాతావరణం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా ఈ సమస్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకెళ్లి పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం, అధికారులు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారి అంబటి అంజయ్యను వివరణ కోరగా సమస్యను గతంలోనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు చేపడతామని వెల్లడించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం నిర్వహించారు.నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన,నకిరేకల్ డాక్టర్స్ కాలనీ నివాసి దివంగత ఓం రాములు యాదవ్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి మల్లీశ్వరి రోగులు, వారి సహాయకుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ ఉప్పల సంతోష్ కుమార్,నకిరేకల్ వృద్ధాశ్రమం ట్రస్ట్ చైర్మన్ ఎన్.రామ్మోహన్‌రావు,కార్యదర్శి సూర్య చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

